క్లుప్తంగా

శ్రీమల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయంలో దిష్టికుంభం ఏర్పాటు

ఎలిగేడు: మండలంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో దిష్టికుంభం, హారతి, తీర్థప్రసాద తదితర ప్రత్యేక పూజకార్యక్రమాలను కనులపండువగా నిర్వహించారు. ఈ ఉత్సవాల ప్రారంభోత్సవాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. 16 న సోమవారం ఉదయం స్వామివారికి లగ్నపట్నం, 18న నాగవెల్లిపట్నం, అన్నదానం ఉంటుందని ఆలయకమిటీ చైర్మన్ గుర్రం మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



పోలీస్ క్రీడాకారులతో సీఐ, ఎస్సైలు

జ్యోతినగర్: క్రీడల్లో రాణిస్తున్న పోలీసులను రామగుండం సీఐ చంద్రశేఖర్ గౌడ్ అభినందించారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ కమిషనరేట్ నిర్వహించిన క్రికెట్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ ఎస్సై జీవన్, అంతర్గాం ఎస్సై సంతోష్, పోలీసులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌కు సాగునీరు విడుదల



ఎల్లంపల్లి నుంచి విడుదల చేసిన సాగునీరు

ముత్తారం: మండలంలోని మచ్చుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని శుక్రవారంపేట రిజర్వాయర్‌కు శనివారం సాగునీరు విడుదలైనట్లు రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యాసంగి పంటకోసం నీటిని విడుదల చేయాలని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు దృష్టికి తీసుకెళ్లడంతో గుండారం రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయించినట్లు తెలిపారు. లక్కారం పెద్ద చెరువు, ముత్తారం మండలంలోని పలు చెరువులు నిండుతాయని, నీటి విడుదలకు సహకరించిన పుట్టమధుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాదాసి రమేష్, బర్ల కొమురయ్య,గుర్రాల నాగరాజు, కలవేన పోచాలు, రాజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అపూర్వ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సుల్తానాబాద్: పట్టణంలోని వివేకానంద పాఠశాలలో 2014- 2015 పదోతరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులు, చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నందుకు గర్వ పడుతున్నామని వివేకానంద పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు భూసారపు బాలకిషన్ ప్రసాద్ ,ఉమా రాణి అన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు బాల కిషన్ ప్రసాద్, ఉమారాణి రవీందర్, సుజాత, కాసర్ల మధుసూదన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులుప్రతాప్, స్వరూప పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

బామ్లానాయక్ తండాలో క్రికెట్ టోర్నమెంట్

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండాలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అంజినాయక్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలను కన్నాల సింగిల్ విండో మాజీ చైర్మన్ మల్క రామస్వామి ప్రారంభించారు. మొత్తం 5 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో రాజీవ్‌తండా జట్టు విజేతగా, బామ్లానాయక్ జట్టు రన్నర్‌గా నిలిచింది. జట్లకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పీట్ల గోపాల్ బహుమతులు అందజేశారు.



గోదావరిఖని బస్టాండ్ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం

వైభవంగా గోదాదేవి కల్యాణం



శ్రీ గోదారంగనాయకుల కల్యాణాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిపించారు. పెద్దపల్లి రామగుండం, మంథని నియోజకవర్గ కేంద్రాలు, గోదావరిఖని పట్టణం, జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్,రామగిరి, ధర్మారం మండలాల్లోని పలు గ్రామాల్లో గోదాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం కల్యాణంను వేద పండితులు అశేష భక్త జనవాహిని మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

- సాక్షి, నెట్‌వర్క్



రామగిరి మండలం లద్నాపూర్‌లో స్వామివారి కల్యాణం



మంథనిలో..



కమాన్‌పూర్‌లో..



పెగడపల్లి కృష్ణాలయంలో గోదాదేవి కల్యాణం



జూలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణం..



నీరుకుల్ల రంగనాయకుల ఆలయంలో ..

సంక్రాంతి సంబురాలు



ఓదేడ్‌లో ముగ్గులు వేస్తున్న బాలికలు



మంథనిలో భోగి మంటలు..

భోగి పండగను శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇంట్లోని పాత వస్తువులను భోగి మంటల్లో వేసి సంబరాలు జరుపుకున్నారు. మహిళలు వేకువజామునే లేచి ఇళ్లు శుభ్రం చేసుకుని తమ ఇళ్లల్లోని వాకిళ్లలో రంగు, రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టి, నవధాన్యాలు, పూలను పేర్చారు. పిండివంటలు చేసుకున్నారు. గోమాతలను పూజించారు. చిన్నారులకు రేగి పండ్లతో స్నానం చేయించారు. కార్యక్రమాల్లో మహిళలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

- సాక్షి, నెట్‌వర్క్

డివిజన్ల సమస్యలపై వినతిపత్రం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీ, న్యూపీకే రామయ్యకాలనీలో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయంపై మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు వినతిపత్రాలు అందించగా స్పందించినట్లు సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర నాయకుడు దుర్గం నగేశ్ అన్నారు. ప్రజా సమస్యలపై స్పందించిన ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌కు నగేశ్ ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. కేటీఆర్ ఆదేశాల మేరకు కలెక్టర్ సంగీత ఎన్టీపీసీ రామగుండం హెచ్‌ఆర్ అధికారులకు సీఎస్సార్ నిధులను కేటాయించి ఉత్తర్వులను విడుదల చేశారని పేర్కొన్నారు. ఇందిరమ్మ కాలనీలో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశాలు రావడంతో రైతు సంఘం నాయకులు ముడిమడుగుల మల్లన్న, సబ్ స్టేషన్ ఏఈ శ్రీనివాసరావుకు ఇందిరమ్మ కాలనీ, న్యూపీ.కే.రామయ్యకాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంవీటీసీ కార్మికులతో వెట్టిచాకిరి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

రామగిరి: సింగరేణి సంస్థ ఏపీఏ ఏరియా పరిధిలోని అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్(ఏఎల్‌పీ)లో వీటీసీ నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్ట్ కార్మికులతో వెట్టి చారికి చేయిస్తున్నారని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టీయూ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న ఆరోపించారు. సెంటినరీకాలనీలో శనివారం మాట్లాడారు. ఏఎల్పీలో సర్ఫేస్‌లో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్, బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులను వీటీసీ నిబంధనలకు విరుద్ధంగా సింగరేణి యాజమాన్యం అండర్ గ్రౌండ్‌లోకి దింపి పనులు చేయించడం సరికాదన్నారు. సింగరేణిలో ఎంవీటీసీ అండర్ గ్రౌండ్ ట్రైనింగ్ చేసిన వాళ్లు మాత్రమే అండర్‌గ్రౌండ్‌లో పనులు చేయాలని, సర్ఫేస్ ట్రైనింగ్ చేసిన కార్మికులు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు సర్ఫేస్‌లోనే పనులు చేయాల్సి ఉంటుందని అన్నారు. వీటీసీ నిబంధనలను, రక్షణ చర్యలను విస్మరిస్తున్న యాజమాన్యం, సంబంధిత రక్షణ అధికారులు రక్షణ సూత్రాలు మరచి కార్మికులను అండర్ గ్రౌండ్‌లోకి దింపడం రక్షణ సూత్రాలకు వ్యతిరేకమని తెలిపాడు. ఇప్పటికైనా యాజమాన్యం రక్షణ సూత్రాలను విస్మరించి పనులు చేయించడాన్ని వెంటనే మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వీటీసీ నిబంధనలకు లోబడి కాంట్రాక్ట్ కార్మికులతో పని చేయించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్ అందజేత

సుల్తానాబాద్: క్రీడలకు పుట్టిలు సుల్తానాబాద్ అని కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండే వెంకన్న పటేల్ అన్నారు. శనివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడాకారులకు వాలీబాల్ కిట్ అందజేసి మాట్లాడారు. వాలీబాల్ కిట్ కావాలని కేసీఆర్ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మణ్ అడగగా, ఆయన సూచన మేరకు వాలీబాల్ అందించినట్లు తెలిపారు. సుల్తానాబాద్ నుంచి ఎంతోమంది క్రీడాకారులు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. అతి త్వరలో జిల్లాలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చాతల్ల కాంతయ్య స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్, కుమార్ కిషోర్, బొద్దుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

కమాన్‌పూర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలో పుప్పాల తిరుపతి స్మారకార్థం మల్యాల రాజేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలకు మహిళలు, విద్యార్థులు పోటాపోటీగా ముగ్గులు వేశారు. విజేతలకు సర్పంచ్ నీలం సరిత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నీలం శ్రీనివాస్, మల్లారపు అరుణ్, మల్యాల తిరుపతి, గాండ్ల మోహన్, రంగు సత్యనారాయణ, నల్లవెళ్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతి ప్రదానం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారు చందపల్లి, మండలంలోని గౌరెడ్డిపేటలో శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన మహిళలకు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీ దాసరి ఉష బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దాసరి పద్మ హనుమయ్య ఫౌండేషన్ సెక్రటరీ సాధిక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: పట్టణంలోని స్వప్న కాలనీ, శాస్త్రినగర్‌లో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. శనివారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శ్రీధర్మశాస్త్ర గోశాలలోగోమాతలకు గ్రాసంగా ఆకుకూరలు, పండ్లు అందజేశారు. గాలిపటాలు పంపిణీ చేశారు. రు. కార్యక్రమంలో రీజియన్ చైర్ పర్సన్ ఎల్లంకి రాజన్న, వాసవి క్లబ్ అధ్యక్షుడు కాసం సత్యనారాయణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు నగదు బహుమతి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో శనివారం త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఆకాంక్ష (ప్రథమ), శైలజ(ద్వితీయ), సుజాత(తృతీయ)నిలిచారు. పోటీల అనంతరం విజేతలకు త్రిశూల్ యూత్ అధ్యక్షుడు పల్లికొండ నాగరాజు, మేడి మహేశ్, రావికంటి నవీన్, సంతోష్, నరేశ్‌తో పాటు పలువురు బహుమతులను అందించారు.

నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్యే సాయం

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌లో నిరుపేద పాక రాజయ్య భార్య సునీత అనారోగ్యంతో మృతి చెందగా తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కన్నం రమేశ్,నాయకులు పాక ప్రభాకర్, తలారి శ్రీను, అంజయ్య, మధునయ్య, మల్లేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ఓదెల: మద్యంతాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పొత్కపల్లి ఎస్సై మహేందర్ అన్నారు. శనివారం ఓదెల మండలం మడక, పొత్కపల్లి, ఇందుర్తి గ్రామాల్లో వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ నిబంధనల మేరకు వాహనాలను నడిపితే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్నీ ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

రామగిరి: మండలంలోని సెంటినరీకాలనీలో స్వామి వివేకానందుని విగ్రహం వద్ద శనివారం వీరేశ్వర యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానందుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వామి వివేకానందుని సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ అరెల్లి దేవక్క, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు తోట చంద్రయ్య, వీరేశ్వర యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కొప్పుల గణపతి, నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న నాయకులు

రామగిరి: కోనసీమ జిల్లాలోని అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని శనివారం బీఆర్ఎస్ నాయకులు దర్శించుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ జాతీయ పార్టీగా అవతరించిన తర్వాత ఆంధ్రాలో వివిధ పార్టీల సీనియర్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరి బీఆర్ఎస్‌ను బలోపేతం చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో అంధ్రప్రదేశ్‌లో మెజారిటీ ఎంపీ స్థానాలు సాధించాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ రామగిరి, కమాన్‌పూర్ మండలాల అధ్యక్షులు శెంకేషి రవీందర్, పిన్‌రెడ్డి కిషన్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు బొంగాని అనిల్ గౌడ్, నాయకులు పుల్లెల కిరణ్, సంతోష్ రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధి కోసమే అనుచిత వ్యాఖ్యలు'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రామగుండం: రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణపై రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని, అభివృద్ధి అంశాలపై ప్రజలు ప్రశ్నించకుండా వాటిని పక్కదారి పట్టించేందుకే విపక్ష ప్రతినిధులపై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు మాడ నారాయణ రెడ్డి అన్నారు. శనివారం అంతర్గాం మండల కేంద్రంలో మాట్లాడారు. బొగ్గు గనులను ప్రయివేటీకరించమని ప్రధాని మోదీ స్పష్టం చేసినప్పటికీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు సింగరేణి కార్మికులను అయోమయానికి గురి చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే చందర్ నియోజకవర్గ ప్రజలకు దూరంగా ఉంటూ అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. అంతర్గాం మండలంలో తీసుకొచ్చిన అభివృద్ధి నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సోమారపుపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో మండల ప్రతినిధులు బోడకుంట సుభాష్, బోడకుంట జనార్దన్, దుర్గం రామకృష్ణ, ఆవుల విజయ్‌పాల్, ఏ.నరేశ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్ వాసికి యువ సేవా పురస్కార్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగరాజు

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన అక్కినపల్లి నాగరాజుకు 2022 యువ సేవా పురస్కార్ అవార్డు లభించింది. భరోసా స్వచ్ఛంద సేవాసంస్థ స్థాపించి ఎన్నో సామాజిక సేవలు, కరోనా సమయంలో వేలాది మందికి అన్నదానం, కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత భోజనం, ప్రభుత్వ పాఠశాలకు సంతకాలు, బ్యాగులు అనాథలకు, అభాగ్యులకు సంస్థ ఆధ్వర్యంలో ఎందరినో ఆదుకుని అండగా నిలిచి, ఉత్తమమైన సామాజిక సేవాకార్యక్రమాలను చేపట్టినందుకు ఇటీవల కరీంనగర్‌లో తెలంగాణ యువజన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఈ అవార్డును అందుకున్నారు. కరీనగర్ మేయర్ సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజును పలువురు అభినందించారు.

వడ్డెరలను ఎస్టీలుగా గుర్తించాలి

రామగుండం: వడ్డెరలను ఎస్టీ కేటగిరీలో చేర్చాలని, వడ్డెర కార్మికులకు క్వారీలపై పూర్తి హక్కులను కల్పించాలని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య కోరారు. శనివారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను కలిసి వడ్డెర హక్కుల సాధనకు చర్యలు చేపట్టాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అణగారిన వర్గాలుగా ఉన్న వడ్డెరల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, ఎస్టీ జాబితాలో చేర్చితే విద్యావంతులకు ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. వడ్డెర కులవృత్తులలో అతి ప్రధానమైన క్వారీ (బండ కొట్టడం)లపై పూర్తి హక్కులు కల్పించాలని, వడ్డెర కార్మికులపై అటవీశాఖ అధికారుల వేధింపులు నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో దండుగుల రామకృష్ణ, రమేశ్, మహేశ్, ఒల్లెపు సమ్మయ్య, శ్రీనివాస్, సూరతార, కొమ్మిరి రజిత, దండుగుల లక్ష్మణ్, కంది అశోక్, వెంకటమ్మ తదితరులున్నారు.

సమాచారం

16న ప్రజావాణి రద్దు

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 16న రద్దు చేస్తున్నామని కలెక్టర్ సంగీత తెలిపారు. తమ సమస్యలపై వినతులు ఇచ్చేవారు రావొద్దని సూచించారు.

కాకర్లపల్లిలో పెద్దమ్మతల్లి బోనాలు



కాకర్లపల్లిలో బోనాలతో వస్తున్న మహిళలు



కాల్వశ్రీరాంపూర్‌లో పోచమ్మ బోనాలతో మహిళలు

మంథని: మండలంలోని కాకర్లపల్లిలో పెద్దమ్మ తల్లి బోనాలను యాదవులు ఘనంగా జరుపుకున్నారు. ఒగ్గు డప్పు చప్పుళ్లతో మహిళలు బోనాలు ఎత్తుకుని గ్రామంలో ఊరేగింపుతో పెద్దమ్మ గుడికి చేరుకున్నారు.అనంతరం పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో శనివారం ముదిరాజ్ కులస్తులు పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలతో, నెత్తిన బోనాలతో, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష, సర్పంచు ఆడెపు శ్రీదేవి, ఎంపీటీసీ సువర్ణ, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.